క్లుప్తంగా

ఆర్‌బీకే చానల్ ప్రసారాలు వీక్షించాలి

తాళ్లూరు: రైతులు ఆర్‌బీకే ద్వారా ప్రసారమయ్యే కార్యక్రమాలు వీక్షించాలని వ్యవసాయాధికారి ప్రసాదరావు కోరారు. విఠలాపురం ఆర్‌బీకేను ఆయన మంగళవారం పరిశీలించారు. ఆర్‌బీకే చానల్ ద్వారా రైతులకు రోజూ ఉదయం 11 గంటలకు, సాయంత్రం నాలుగు గంటలకు వ్యవసాయ, ఉద్యాన, పశుసంవర్ధక, మత్స్య, పట్టు, మార్కెటింగ్ తదితర అనుబంధ శాఖలకు సంబంధించిన కార్యక్రమాలు ప్రసారమయ్యే అంశాలు రైతులకు తెలియజేయాలని వీఏఏలను కోరారు. శాస్త్రవేత్తలు, అధికారులు, ఆదర్శ రైతులు, వక్తలు తమ అమూల్యమైన సందేశాలు అందిస్తారని చెప్పారు. అందుకు సంబంధించిన షెడ్యూల్‌ను నోటీస్ బోర్డులో ఏర్పాటు చేశారు. వీఏఏ నాగరాజు నాయక్, మత్స్యశాఖ అసిస్టెంట్ ఎలీషా పాల్గొన్నారు.

రెండు బైకులు ఢీకొని.. ఒకరికి గాయాలు


వెంకటేశ్వర్లు

కురిచేడు: స్థానిక దర్శి రోడ్డులోని మద్యం దుకాణం వద్ద మలుపు తిరుగుతున్న ద్విచక్ర వాహనాన్ని దర్శి వైపు నుంచి వస్తున్న ద్విచక్ర వాహనం ఢీకొట్టడంతో కిలారి వెంకటేశ్వర్లు అనే వ్యక్తికి గాయాలయ్యాయి. ఈ సంఘటన మంగళవారం మధ్యాహ్నం జరిగింది. వివరాలు.. మండలంలోని పెద్దవరం గ్రామానికి చెందిన కిలారు వెంకటేశ్వర్లు మరో వ్యక్తితో కలిసి ద్విచక్ర వాహనంపై కురిచేడు వచ్చి తన పనులు ముగించుకుని తిరుగు ప్రయాణంలో మద్యం షాపు వద్దకు వెళ్లారు. మద్యం కొనుగోలు చేసుకుని బయల్దేరి రోడ్డుపైకి వచ్చి తమ ద్విచక్ర వాహనం తిప్పుకునే సమయంలో ప్రమాదం జరిగింది. క్షతగాత్రుడిని మరో ద్విచక్ర వాహనంపై స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి తరలించి చికిత్స అందించారు. ప్రమాదం లేదని వైద్యులు తెలిపారు.

వృద్ధాశ్రమానికి బ్యాంకు చేయూత

తాళ్లూరు: గుంటి గంగలోని తేజ వయే వృద్ధాశ్రమానికి పంజాబ్ నేషనల్ బ్యాంకు చేయూత ఇచ్చింది. సామాజిక సేవా కార్యక్రమాల్లో భాగంగా దర్శి బ్రాంచి మేనేజర్ నేలపాటి లక్ష్మీనారాయణ ఆశ్రమాన్ని సందర్శించి వృద్ధులకు అవసరమైన రూ.26,500 విలువైన వాటర్ కూలింగ్ మిషన్, మంచాలు, కుర్చీలు అందించారు. ఆశ్రమ నిర్వాహకులు అంబటి వెంకటేశ్వరరెడ్డిని అభినందించారు. ఆశ్రమానికి తమ వంతు చేయూత ఉంటుందని చెప్పారు.

పశువుల ఆరోగ్యంపై అశ్రద్ధ వద్దు

పెద్దారవీడు: పశువుల ఆరోగ్యంపై పశుపోషకులు అశ్రద్ధ చేయకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సర్పంచ్ గుడ్డెపోగు రమేష్ అన్నారు. మండలంలో సుంకేసులలో పశువులకు గాలికుంటు వ్యాధి నివారణ టీకాల కార్యక్రమం పశువైద్య సిబ్బంది మంగళవారం నిర్వహించారు. సర్పంచ్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన పశువులకు టీకాలు పశుపోషకులు తప్పనిసరిగా వేయించాలని సూచించారు. పశుసంవర్ధక శాఖ సహాయ కార్యదర్శి షేక్ అమీర్‌బాషా, రైతులు పాల్గొన్నారు.

సచివాలయంలో కంప్యూటర్లు మాయం

దర్శి: మండలంలోని పాతకమూరు సచివాలయంలో సోమవారం రాత్రి కంప్యూటర్లు మాయమయ్యాయి. ఎస్‌ఐ రామకృష్ణ తెలిపిన వివరాల ప్రకారం.. మంగళవారం సచివాలయం తెరిచి చూడగా కంప్యూటర్లు కనిపించలేదు. వేసిన తాళాలు వేసినట్లే ఉన్నాయని, కంప్యూటర్‌లు మాత్రం మాయమయ్యాయని పంచాయతీ కార్యదర్శి చిన్నకాశీం నాయక్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

మహిళలు ఆర్థికంగా ఎదగాలి

● ఎమ్మెల్యే అన్నా రాంబాబు


మాట్లాడుతున్న ఎమ్మెల్యే అన్నా రాంబాబు

గిద్దలూరు రూరల్: మహిళలు ఆర్థికంగా ఎదగాలని ఎమ్మెల్యే అన్నా రాంబాబు ఆకాంక్షించారు. స్థానిక మార్కెట్ యార్డు కార్యాలయం ఆవరణలో మంగళవారం ఏర్పాటు చేసిన 3వ విడత వైఎస్సార్ ఆసరా కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ముందుగా డ్వాక్రా మహిళలు, వైఎస్సార్ సీపీ నాయకులతో రాచర్ల గేటు సెంటర్‌లోని వైఎస్సార్ విగ్రహానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం అక్కడి నుంచి మార్కెట్ యార్డు వరకు ర్యాలీ చేశారు. సమావేశానికి ముందుగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో ఎమ్మెల్యే అన్నా రాంబాబు మాట్లాడారు. ప్రజల ఆదరణ, అభిమానం కొనుక్కుంటే రావని, అవి ప్రజల హృదయాల్లో సంపాదించుకోవాలన్నారు. రాష్ట్రంలో మొత్తం 32 లక్షల మందికి సొంత ఇంటి కలను నెరవేర్చిన ఏకైక ప్రభుత్వం వైఎస్సార్ కాంగ్రెస్ ప్రభుత్వమన్నారు. ప్రతి పథకంలో మహిళలకే ప్రాధాన్యం ఇస్తూ అక్క చెల్లెమ్మలకే పెద్దపీట వేశారని గుర్తు చేశారు. రాష్ట్ర ప్రభుత్వం మహిళలు తమ స్వశక్తితో ముందుకు సాగాలనే సదుద్దేశంతో వారికి ఆసరాగా నేరుగా వారి బ్యాంక్ అకౌంట్‌లోకి నగదు వేస్తోందన్నారు. 11 ఏప్రిల్, 2019 నాటికి బ్యాంక్‌ల్లో అప్పు ఉన్న పొదుపు గ్రూపు సభ్యులకు నాలుగు విడతలుగా వారి అకౌంట్లలో జమ చేస్తామని పాదయాత్రలో ముఖ్యమంత్రి ఇచ్చిన హామీకి కట్టుబడి నేడు వారికి ఆసరా నగదు అందజేస్తున్నారన్నారు. చంద్రబాబునాయుడు అబద్ధాల హామీలతో అధికారంలోకి రావాలని 600 హామీలు గుప్పించారని గుర్తు చేశారు. వాటిని ప్రజలు నమ్మకపోగా జగన్‌మోహన్‌రెడ్డిపై విశ్వాసంతో వైఎస్సార్ కాంగ్రెస్‌కు అధికారం కట్టబెట్టారని ఎమ్మెల్యే అన్నా పేర్కొన్నారు. గిద్దలూరు పట్టణం, మండలం, రాచర్ల, కొమరోలు మూడు మండలాల పరిధిలో మొత్తం 2,847 పొదుపు గ్రూపుల్లోని 27,310 మంది సభ్యులకు రూ.19.64 కోట్ల నగదు చెక్కులు లబ్ధిదారులకు అందజేస్తున్నామన్నారు. ఇప్పటి వరకు మూడు విడతలు కలిపి రూ.59.3 కోట్ల నగదు లబ్ధిదారులకు అందాయని ఎమ్మెల్యే అన్నా రాంబాబు వివరించారు. ఎంపీడీఓ ఆకుల రంగనాయకులు, కమిషనర్ రామకృష్ణ, నగర పంచాయతీ చైర్మన్ పాముల వెంకట సుబ్బయ్య, మూడు మండలాల జెడ్పీటీసీలు, ఐకేపీ ఏపీఎంలు నరేష్, పాండురంగ ప్రసాద్, రమేష్, ప్రసాద్, వైఎస్సార్ సీపీ క్రిస్టియన్ మైనార్టీ జిల్లా అధ్యక్షుడు గోన రంజీత్‌కుమార్, నగర పంచాయతీ వైస్ చైర్మన్లు ఆర్‌డీ రామకృష్ణ, దీపికా, వైఎస్సార్ సీపీ నాయకులు కోటా నరసింహులు, భూమా నరసింహారెడ్డి, జనార్దన్‌రెడ్డి, మెప్మా పీడీ రవికుమార్, రాష్ట్ర మహిళా కార్పొరేషన్ డైరెక్టర్ కౌసల్య పాల్గొన్నారు.

ప్రభుత్వం చేసిన మంచిని వివరించండి


కృష్ణమోహన్‌రెడ్డిని సన్మానిస్తున్న నాయకులు


మాట్లాడుతున్న రవిచంద్ర

● టీడీపీ, జగనన్న పాలనకు మధ్య వ్యత్యాసాన్ని తెలియజెప్పాలి
● వైఎస్సార్ సీపీ శ్రేణులకు నేతల సూచన


నాయకులకు స్టిక్కర్లు పంపిణీ చేస్తున్న శ్రీనివాసరెడ్డి

తర్లుపాడు: ప్రతి కుటుంబానికి ప్రభుత్వం చేసిన మంచిని వివరించి రానున్న సార్వత్రిక ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ విజయానికి పార్టీ శ్రేణులు కృషి చేయాలని ఎమ్మెల్యే కేపీ నాగార్జునరెడ్డి సోదరుడు కృష్ణమోహన్‌రెడ్డి సూచించారు. మంగళవారం కేతగుడిపి, సీతానాగులవరం, గానుగపెంట, పోతలపాడు, సచివాలయాల పరిధిలోని కన్వీనర్లు, గృహసారథులు, వలంటీర్లకు నిర్వహించిన సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఈ నెల 7వ తేదీ నుంచి నిర్వహించనున్న ×మా నమ్మకం నువ్వే జగనన్న× కార్యక్రమాన్ని విజయవంతం చేయాలన్నారు. వలంటీర్లతో సమన్వయం చేసుకుని ప్రభుత్వ సంక్షేమ పథకాల లబ్ధిని ప్రజలకు వివరించాలని సచివాలయ కన్వీనర్లు, గృహ సారథులు దిశానిర్దేశం చేశారు. గత టీడీపీ ప్రభుత్వ హయాంలో అర్హులకు సంక్షేమ ఫలాలు అందలేదని, జగనన్న ప్రభుత్వంలో అర్హులకు జరిగిన న్యాయాన్ని ప్రజలకు వివరించాలన్నారు. సమావేశంలో ఎంపీపీ భూలక్ష్మిరామసుబ్బారెడ్డి, పార్టీ మండల అధ్యక్షుడు మురారి, వైస్ ఎంపీపీలు సుజాత, పుణ్యవతమ్మ, జేసీఎస్ కన్వీనర్ రామాంజనేయరెడ్డి, సర్పంచ్‌లు పెద్ద మస్తాన్, నవ్య, ఆంజనేయులు, శ్రీనివాసరెడ్డి, బాలయ్య, ఎంపీటీసీ అంకయ్య, నాయకులు దాసయ్య, రమణయ్య, మల్లారెడ్డి, సీహెచ్ రమేష్, హరి తదితరులు పాల్గొన్నారు.

మార్కాపురం: ఈ నెల 7 నుంచి మార్కాపురం పట్టణంలో నిర్వహించనున్న ×మా నమ్మకం నువ్వే జగనన్న× కార్యక్రమాన్ని కౌన్సిలర్లు, వార్డు అధ్యక్షులు విజయవంతం చేయాలని ఆ పార్టీ పట్టణ ప్రధాన కార్యదర్శి పత్తి రవిచంద్ర కోరారు. మంగళవారం స్థానిక 11వ బ్లాక్‌లో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. 7 నుంచి 14వ తేదీ వరకు పట్టణంలో ప్రతి ఇంటికీ వెళ్లి జగనన్న ప్రభుత్వంలో సంక్షేమ పథకాలతో ప్రజలకు కలిగిన లబ్ధి, గత టీడీపీ ప్రభుత్వంలో అర్హులు పడిన ఇబ్బందులను వివరించాలని సూచించారు. జగనన్న ప్రభుత్వంపై అభిప్రాయాలను కూడా లబ్ధిదారుల నుంచి తీసుకోవాలన్నారు. సమావేశంలో వార్డు ఇన్‌చార్జి ఉత్తమ్ కుమార్, సచివాలయ కన్వీనర్లు సీహెచ్ వెంకటరెడ్డి, కామిశెట్టి సురేష్, వార్డు అధ్యక్షుడు వెంకటరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పొదిలి రూరల్: వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలపై ప్రజలను 5 ప్రశ్నలు అడిగి వారి అభిప్రాయాలు తెలుసుకోవాలని ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శి సానికొమ్ము శ్రీనివాసరెడ్డి సూచించారు. పొదిలి పట్టణ పరిధిలోని కాటూరివారిపాలెం 6వ సచివాలయంలో సచివాలయాల కన్వీనర్లు, గృహసారథులు, వార్డు అధ్యక్షులు, నాయకులతో సమావేశం నిర్వహించారు. ప్రజల అనుమతితో వారి ఇంటికి స్టిక్కర్లు అతికించాలని సూచించారు. అనంతరం స్టిక్కర్లు పంపిణీ చేశారు. సమావేశంలో పార్టీ జిల్లా కార్యదర్శి గొలమారి చెన్నారెడ్డి, మాదాలవారిపాలెం సొసైటీ అధ్యక్షుడు కొత్తపులి బ్రహ్మారెడ్డి, ఈడిగ కార్పొరేషన్ డైరెక్టర్ జూపల్లి ఏడుకొండలు, పి.ప్రసాద్, అశోక్, గుంజా శ్రీనివాసులు, వీరానారాయణ, వినోద్ తదితరులు పాల్గొన్నారు.

పట్టణంలో ఐదు చోట్లే బస్సులు నిలపాలి

● ఆర్టీసీ డ్రైవర్లకు సీఐ భీమానాయక్ సూచన


ఆర్టీసీ డ్రైవర్లకు సూచనలిస్తున్న సీఐ భీమానాయక్

మార్కాపురం: మార్కాపురం పట్టణంలో ట్రాఫిక్ సమస్య నివారణకు ఆర్టీసీ డ్రైవర్లతోపాటు ప్రైవేట్ వాహనాల డ్రైవర్లు సహకరించాలని సీఐ ఎం.భీమానాయక్ కోరారు. మంగళవారం ఆయన ఆర్టీసీ డిపో ఆవరణలో డ్రైవర్లతో మాట్లాడారు. పట్టణంలో తాము గుర్తించిన 5 స్టాపుల్లో మాత్రమే బస్సులు ఆపి ప్రయాణికులను దించడం, ఎక్కించుకోవడం చేయాలన్నారు. ఆటోలతోపాటు టూవీలర్లు, కార్లు ఇతర వాహనాలు ఎక్కడపడితే అక్కడ ఆపడం వల్ల ట్రాఫిక్ సమస్య జటిలమవుతోందన్నారు. ఈ నేపథ్యంలో ట్రాఫిక్ సమస్యను అధిగమించేందుకు ఎమ్మెల్యే కేపీ నాగార్జునరెడ్డి, తాము పట్టణంలో పర్యటించి సమస్య నివారణకు తీసుకోవాల్సిన చర్యలపై చర్చించామన్నారు. అందులో భాగంగా ఆర్డీఓ ఆఫీస్ ఎదుట, కోర్టు ఎదురుగా నూతనంగా నిర్మించిన అర్బన్ హెల్త్ సెంటర్ వద్ద, హెడ్ పోస్ట్ ఆఫీస్ వద్ద, పాత బస్టాండ్‌లోని గడియార స్తంభం ఫుట్‌వేర్ కాంప్లెక్స్ వద్ద, దోర్నాల బస్టాండ్ వద్ద మాత్రమే బస్సులు నిలపాలని నిర్ణయించామన్నారు. కార్యక్రమంలో డిపో మేనేజర్ ఏఎస్ నరసింహులు పాల్గొన్నారు.

వలంటీర్లు బాధ్యతగా పని చేయాలి

ముండ్లమూరు: నూతనంగా బాధ్యతలు చేపట్టిన వలంటీర్లు బాధ్యతగా పనిచేయాలని ఎంపీపీ సుంకర సునీతాబ్రహ్మారెడ్డి అన్నారు. స్థానిక ఎంపీపీ కార్యాలయంలో మంగళవారం తన కార్యాలయంలో వలంటీర్లకు ఆమె నియామక పత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి పథకాలను ప్రజలకు చేరువ చేయడంలో చిత్తశుద్ధితో పని చేయాలన్నారు. ప్రభుత్వ పథకాలపై ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. అనంతరం పులిపాడు పంచాయతీకి చెందిన కుంటా అనిల్‌కు నియామక పత్రం అందజేశారు. సూపరింటెండెంట్ రామాంజనేయులు, సిబ్బంది కరుణాకర్ ఉన్నారు.

ప్రచారం కిట్లు పంపిణీ


కిట్లు పంపిణీ చేస్తున్న సర్పంచ్‌లు, నాయకులు

పెద్దారవీడు: మండలంలోని తంగిరాలపల్లె, మద్దలకట్ట సచివాలయాల పరిధిలో సర్పంచ్‌లు తోకల నాగమల్లేశ్వరి, గుంటు గాలెమ్మ ఆధ్వర్యంలో గ్రామ సచివాలయ కన్వీనర్లు, గృహసారథులకు మా నమ్మకం జగనన్న నువ్వే ప్రచార కిట్లను మండల సచివాలయ కన్వీనర్ ఏర్వ వెంకటేశ్వరరెడ్డి మంగళవారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సర్పంచ్‌లు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించాలని తెలిపారు. పార్టీ బలోపేతానికి ప్రతి కార్యకర్త తన వంతుగా కృషి చేయాలని పిలుపునిచ్చారు. వైఎస్సార్ సీపీ మండల బీసీసెల్ అధ్యక్షుడు తోకల ఆవులయ్య, నాయకులు మూల సత్యనారాయణరెడ్డి, వార్డు మెంబర్ ఏర్వ మల్లికార్జునరెడ్డి, గ్రామ సచివాలయ కన్వీనర్లు, గృహసారథులు పాల్గొన్నారు.

విద్యతోనే ఉన్నత భవిష్యత్

● ఎంఈఓ శ్రీనివాసరెడ్డి


మాట్లాడుతున్న ఎంఈఓ శ్రీనివాసరెడ్డి

పొదిలి రూరల్: విద్యార్థులు ఇష్టపడి చదువుకుని ఉన్నత స్థాయికి ఎదగాలని ఎంఈఓ మామిళ్లపల్లి శ్రీనివాసరెడ్డి ఆకాంక్షించారు. మంగళవారం ఓబులక్కపల్లి ప్రాథమికోన్నత పాఠశాల వార్షికోత్సవంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఎంఈఓ మాట్లాడుతూ.. విద్యార్థులు క్రమశిక్షణ కలిగి ఉండాలన్నారు. విద్యతోనే ఉన్నత భవిష్యత్ సాధ్యపడుతుందని, తద్వారా చదువుకున్న పాఠశాలకు, తల్లిదండ్రులకు, స్వగ్రామానికి మంచి పేరు వస్తుందన్నారు. అనంతరం చిన్నారులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆహూతులను అలరించాయి. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీ పోస్టులకు దరఖాస్తు చేసుకోవాలి

బేస్తవారిపేట: బేస్తవారిపేట ఐసీడీఎస్ ప్రాజెక్ట్ పరిధిలోని ఖాళీగా ఉన్న రెండు అంగన్‌వాడీ కార్యకర్తల పోస్టులకు దరఖాస్తు చేసుకోవాలని సీడీపీఓ నాగమణి సూచించారు. బేస్తవారిపేట మండలం జేబీకే పురం ఎస్టీ, కంభం మండలం కంభం-6 సెంటర్ ఓసీకి కేటాయించినట్లు పేర్కొన్నారు. ఈ నెల 17వ తేదీలోపు దరఖాస్తులు అందజేయాలని కోరారు. జనవరి ఒకటో తేదీ నాటికి 18 ఏళ్లు నిండి ఉండాలని, పదో తరగతి ఉత్తీర్ణులైన అభ్యర్థులు అర్హులన్నారు.

పుల్లలచెరువు: మండలంలోని వివిధ గ్రామాల్లోని అంగన్‌వాడీ కేంద్రాల్లో ఖాళీగా ఉన్న అంగన్‌వాడీ సహాయకుల పోస్టులకు అర్హులైన వారు దరఖాస్తు చేసుకోవాలని సూపర్‌వైజర్ శివలక్ష్మి సూచించారు. ఖాళీల వివరాలు మర్రివేముల (బీసీ-ఎ), రెంటపల్లి-1 (బిసి-డి), సి.కొత్తపల్లి (బిసి-బి), నాయుడుపాలెం-3(ఒసి), ముటుకుల-1(బిసి-బి), కవలకుంట్ల (బిసి-ఎ) దరఖాస్తు చేసుకోవాలని, ఈ నెల 17వ తేదీ లోపు తగిన పత్రాలతో వైపాలెంలోని ఐసీడీఎస్ కార్యాలయంలో అందజేయాలని కోరారు.

మహిళా పోలీస్ సస్పెన్షన్

ముండ్లమూరు: ముండ్లమూరు సచివాలయంలో మహిళా పోలీస్‌గా పని చేస్తున్న తాతపూడి శాంతిప్రియను సస్పెండ్ చేస్తూ ఎస్పీ మల్లికాగర్గ్ నుంచి మంగళవారం ఆదేశాలు వచ్చాయని ఎస్‌ఐ సంపత్‌కుమార్ తెలిపారు. విధి నిర్వహణలో అలసత్వం వహించడంపై ఆమెను సస్పెండ్ చేస్తున్నట్లు ఎస్పీ తన ఉత్తర్వుల్లో పేర్కొన్నారని ఎస్‌ఐ పేర్కొన్నారు.

రక్తదానంతో ప్రాణాలు కాపాడాలి

కంభం: రక్తదానంతో ప్రాణాలు కాపాడాలని ప్రభుత్వ డిగ్రీ కళాశాల వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం.గురుశేఖర్ అన్నారు. మార్కాపురం ప్రభుత్వ వైద్యశాల, డిగ్రీ కళాశాల సంయుక్త ఆధ్వర్యంలో మంగళవారం రక్తదాన శిబిరం ఏర్పాటు చేశారు. ప్రతి ఒక్కరూ రక్తదానం చేసి ప్రాణదాతలు కావాలని పిలుపునిచ్చారు. బేస్తవారిపేట మెడికల్ ఆఫీసర్ పృథ్వీరాజ్, వైద్య ఆరోగ్య సిబ్బంది, కళాశాల అధ్యాపకులు పాల్గొన్నారు.


లోక్ అదాలత్‌లో కేసులు పరిష్కారం

గిద్దలూరు రూరల్: జాతీయ లోక్‌అదాలత్‌లో ఎక్కువ కేసులు పరిష్కారమయ్యేలా చూడాలని గిద్దలూరు అడిషనల్ జూనియర్ సివిల్ జడ్జి బి.మేరిసారా దానమ్మ అన్నారు. స్థానిక కోర్టు ఆవరణలో మంగళవారం న్యాయవాదులతో ఆమె ప్రత్యేకంగా సమావేశమయ్యారు. ఆమె మాట్లాడుతూ మే 13వ తేదీన నిర్వహించబోయే లోక్‌అదాలత్‌లో కేసులు పరిష్కారమయ్యేలా చూడాల్సిన బాధ్యత న్యాయవాదులపై ఉందన్నారు. కేసులు రాజీ మార్గంలో పరిష్కారం అయితే కక్షిదారులకు మంచిదన్నారు. న్యాయవాదులు వెంకటేశ్వర్లు, నాగేంద్రబాబు, పిచ్చయ్య యాదవ్, ఉన్నారు.

నేడు వైఎస్సార్ ఆసరా సంబరాలు

మార్కాపురం టౌన్: డీఆర్‌డీఏ, వైఎస్సార్ క్రాంతి పథం ఆధ్వర్యంలో బుధవారం ఉదయం 10 గంటలకు పట్టణంలోని డ్వాక్రా బజారులో వైఎస్సార్ ఆసరా 3వ విడత సంబరాలు నిర్వహిస్తున్నట్లు ఏపీఎం రమేష్‌బాబు తెలిపారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే కేపీ నాగార్జునరెడ్డి హాజరవుతున్నట్లు మంగళవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు, కార్పొరేషన్ల డైరెక్టర్లు, ఎస్‌ఎస్‌జీ గ్రూప్ మహిళలు, ఇతర ముఖ్య ప్రజా ప్రతినిధులు పాల్గొనాలని కోరారు.

నాడు-నేడు పనులు త్వరగా పూర్తి చేయాలి


బెంచీలను పరిశీలిస్తున్న ఎంఈవో శామ్యూల్ జాన్

పుల్లలచెరువు: ఫేస్-2 నాడు-నేడు పనులను సకాలంలో పూర్తి చేయాలని ఎంఈవో శామ్యూల్‌జాన్ కోరారు. మంగళవారం మండలంలోని చాపలమడుగు పాఠశాలను ఆయన తనిఖీ చేశారు. ముందుగా పాఠశాలలో జరుగుతున్న నాడు-నేడు పనులను పరిశీలించారు. పనులు నాణ్యంగా ఉండాలన్నారు. సరఫరా అయిన బెంచీలను పరిశీలించారు. అనంతరం విద్యార్థుల సామర్థ్యాలు పరిశీలించారు. విద్యార్థులకు చదవడం, రాయడం బాగా నేర్పించాలన్నారు. ఉపాధ్యాయుల లెసన్ ప్లాన్స్, డైరీలను తనిఖీ చేసి పలు సూచనలు చేశారు.

కాలువలో పడిన గోవు

● శ్రమించి రక్షించిన స్థానికులు


కాలువలో చిక్కుకున్న గోవు

పొదిలి: ప్రమాదవశాత్తూ కాలువ దాటుతూ అందులో పడిపోయిన గోమాత సుమారు గంట సమయంపాటు నరకం అనుభవించింది. ఈ సంఘటన పొదిలిలో మంగళవారం సాయంత్రం చోటుచేసుకుంది. కాలువ చిన్నది కావడంతో ఆవును బయటకు తీసేందుకు ప్రయత్నించినప్పుడల్లా విలవిల్లాడింది. స్థానికులు తీవ్రంగా శ్రమించినా ఫలితం లేకపోవడంతో జేసీబీతో కాలువ గోడలు పగులగొట్టి ఆవును రక్షించారు. చిన్నపాటి గాయాలతో ఆవు బయట పడింది.

వై.పాలెంలో మోస్తరు వర్షం

యర్రగొండపాలెం: వై.పాలెం ప్రాంతంలో మంగళవారం ఒక మోస్తరు వర్షం కురిసింది. పెద్ద ఎత్తున ఉరుములు, ఈదురు గాలులు, అక్కడక్కడా వడ్లగండ్లతో కూడిన వర్షం కురిసింది. ఈ వర్షంతో భూగర్భ జలాలు పూర్తిగా అడుగంటకుండా సహకరిస్తాయని, ఉద్యాన పంటలకు కొంతవరకు మేలు జరుగుతుందని హెచ్‌వో ఆదిరెడ్డి తెలిపారు. ఖరీఫ్‌లో పంటలు సాగు చేసుకునేందుకు భూములు దుక్కిదున్నుకునేందుకు వర్షం రైతులకు మేలు చేస్తుందని ఏవో వెంకటేశ్వర్లు తెలిపారు.

క్రీడా ప్రాంగణం గేటు నిర్మాణానికి విరాళం

దొనకొండ: స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాలలో క్రీడా ప్రాంగణం గేటు నిర్మాణానికి 1972-73 సంవత్సరానికి చెందిన విద్యార్థి రాచపూడి ప్రసాదరావు లక్ష రూపాయలు విరాళం అందజేశారు. ప్రధానోపాధ్యాయుడు వీవీ రామాంజనేయులుకు సోమవారం నగదు అందజేశారు. తల్లిదండ్రులైన రాచపూడి ఆదినారాయణ, అనంతలక్ష్మి జ్ఞాపకార్థం కుమారుడు ప్రసాదరావు, కోడలు లక్ష్మీ రుక్మిణి ఆ నగదు సమకూర్చారు. ప్రస్తుతం ప్రసాదరావు హైదరాబాద్‌లో ఆడిటర్‌గా పని చేస్తున్నారు. దాతను పాఠశాల సిబ్బంది అభినందించారు.

ముండ్లమూరు తహసీల్దార్‌గా నయీమ్ అహ్మద్

ముండ్లమూరు: తహసీల్దార్‌గా ఎండీ నయీమ్ అహ్మద్ మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. ఇప్పటి వరకు ఇక్కడ తహసీల్దార్‌గా పనిచేసిన ఉషారాణి బదిలీపై జరుగుమల్లి వెళ్లారు. ఆమె స్థానంలో జరుగుమల్లిలో తహసీల్దార్‌గా పని చేస్తున్న ఎండీ నయీమ్ అహ్మద్ బదిలీపై వచ్చి బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలో పెండింగ్ భూ సమస్యలపై ప్రత్యేక దృష్టి పెట్టనున్నట్లు పేర్కొన్నారు.

గూగుల్‌లో స్థానం సంపాదించుకున్న మురారిపల్లె పాఠశాల

యర్రగొండపాలెం: నాడు-నేడు పనులతో మురారిపల్లె పాఠశాల గూగుల్‌లో స్థానం సంపాదించుకుందని ఎంఈవో పి.ఆంజనేయులు తెలిపారు. పాఠశాల వార్షికోత్సవం సందర్భంగా మంగళవారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. రాష్ట్ర పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ మంత్రి డాక్టర్ ఆదిమూలపు సురేష్ చొరవతో ఈ పాఠశాల అభివృద్ధి చెందిందని, మోడల్ స్కూల్‌గా రాష్ట్ర స్థాయిలో అనేక అవార్డులు దక్కించుకుందని, ఉన్నత పాఠశాలగా అప్‌గ్రేడ్ అయిందన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ జయమ్మ ముసలారెడ్డి, హెచ్‌ఎం బాలామణి, ఎస్‌ఎంసీ చైర్మన్ మల్లారెడ్డి పాల్గొన్నారు.

ఆంజనేయా పాహిమాం..

కొనకనమిట్ల: మండలంలోని గొట్లగట్టు అభయాంజనేయస్వామి ఆలయంలో మంగళవారం సువర్చలా సమేత అభయాంజనేయస్వామి వారికి అభిషేకాలు, ఆకు పూజలు, అర్చనలు నిర్వహించారు. మహిళలు పూజా కార్యక్రమంలో పాల్గొని నైవేద్యాలు సమర్పించి భక్తిని చాటుకున్నారు. పంచముఖ ఆంజనేయస్వామికి, ధ్వజ స్తంభాల వద్ద భక్తులు పూజలు చేశారు. ముందుగా తమలపాకులతో ఆకు పూజ నిర్వహించి భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు.